సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



స్థానిక ఎన్నికలపై దృష్టి సారించాలి
స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచేలా దృష్టి సారించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. - 8లో



దివ్యాంగురాలి హత్య
సూర్యాపేట మండలం జాటోత్‌తండాలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దివ్యాంగురాలు హత్యకు గురైంది. - 8లో



బెల్లం, సారా పట్టివేత
అక్రమంగా తరలిస్తున్న 350 కిలోల బెల్లం, 10 లీటర్ల సారాను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్ బదిలీ

భానుపురి (సూర్యాపేట): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక శనివారం బదిలీ అయ్యారు. 2023 జూలైలో అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఏడాది పాటు జిల్లాలో పని చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఎంఏ అండ్ యూడీ విభాగానికి డిప్యూటీ సెక్రటరీగా బదిలీపై వెళ్లారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నూతనకల్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

నూతనకల్: పత్తి సాగు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలో పత్తి పంటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రసం పీల్చే పురుగులు ఆశించడంతో ఆకులు ముడుచుకుపోయి పత్తి చేను ఎదుగుదల క్షీణించడంతో పాటు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. నివారణ కోసం అసిటిమా ప్రైడ్ గ్రాము లీటరు నీటిలో, సూక్ష్మ పోషకాల లోపం రాకుండా ఆగ్రోమిన్ మాక్స్ 2గ్రాములు లేదా ఫార్ములా 6ను వాడాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, ఏఈఓ బుషిగంపల జానయ్యగౌడ్, రైతులు యాస ముత్తారెడ్డి, సాబాది శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

మునగాల: జనాభాలో 50శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్ అన్నారు. శనివారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. తెలంగాణ ఉద్యమం కూడా నల్లగొండ జిల్లా కోదాడ ప్రాంతం నుంచే ప్రారంభమైందని, ఈ ఉద్యమంలో ఎంతో మంది బీసీ విద్యార్థి, యువత ఆత్మ బలిదానాలు చేసుకున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచకుంటే బీసీ వర్గాలు ఏకమై ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు బదిలీ

నల్లగొండ టౌన్: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్‌లు శనివారం బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో జీజే.పాల్, బి.రవికుమార్, జె.రాంరెడ్డి, సీహెచ్.మహిపాల్‌రెడ్డి, అమరేందర్‌జెల్లా, టి.అశోక్‌కుమార్, ఆర్.స్వాతి, జ్ఞానేశ్వర్, ఎం.సందీప్‌కుమార్, ఎస్.నాగార్జునరెడ్డి, కె.అజ్మీరా, ఎస్.శశికళ, ఎ.భరత్‌రెడ్డి, కె.సందీప్‌రెడ్డి, కె.రవి, ఎం.మేగ్యా నాయక్, కె.మహేందర్‌రెడ్డి, పి.చంద్రబాబు, ఎ.శ్రీకాంత్‌రెడ్డి, ఎం.విక్రమ్‌రెడ్డి, వి.అభినవ్, పి.ప్రసన, పి.సురేందర్, భార్గవ్ సంతోష్, టి.సంకేత్, ఎ.శ్రవణ్, ఎస్.మౌనిక రెడ్డి, సుధాకర్ నాయక్, నాగేంద్ర, బి.శ్రీజ ఉన్నారు.

మితిమీరుతున్న వేగం

- నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్న యువత
- ఈ ఏడాది 336 యాక్సిడెంట్లు
- ఇందులో బైక్ ప్రమాదాలే అధికం



సూర్యాపేట టౌన్: యువత బైక్ డ్రైవింగ్ మితిమీరుతోంది. కొందరు యువకులు అతివేగంగా.. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫలితంగా ప్రాణాలు కోల్పోతూ ఇతరుల ప్రాణాలను సైతం బలిగొంటూ వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని మిగులుస్తున్నారు. ఈ ఏడాదిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో బైక్ ప్రమాదాలే అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు అతివేగం, హెల్మెట్ పెట్టుకోకపోవడం.. మద్యం సేవించి నడపడం, త్రిబుల్ రైడింగ్‌తో యువత ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలో రోజు ఎక్కడో ఒకచోట బైక్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిని పట్టుకొని కౌన్సిలింగ్ ఇస్తున్నా.. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదమని చెబుతున్నా.. జరిమానాలు విధిస్తున్నా.. మార్పు రావడం లేదని పోలీసులు అంటున్నారు.

ఇప్పటివరకు 336 ప్రమాదాలు..

జిల్లాలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 336 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో అధికంగా 191 ప్రమాదాలు అంటే 56శాతం బైక్ యాక్సిడెంట్‌లే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం 156 మంది చనిపోగా అందులో 82 మంది ద్విచక్రవాహనదారులే ఉన్నారు. అలాగే పోలీసుల తనిఖీల్లో అనేక మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ దొరికిపోతున్నారు. మొబైల్ మాట్లాడుతూ బైక్ నడుతుపున్న వారిసంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఇందులో ద్విచక్రవాహనదారులతో పాటు కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు నడిపే వారు అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

జనవరి నుంచి నమోదైన కేసులు	
డ్రంక్ అండ్ డ్రైవ్	7,315
ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్	1,552
త్రిబుల్ రైడింగ్	1,602
రాంగ్ రూట్	600

మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో..

18ఏళ్ల లోపు వారు ద్విచక్రవాహనాలు, కార్లు నడపాలని ఉత్సాహపడుతుంటారు. అది కాస్త ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. మైనర్లు బైక్ నడిపేటప్పుడు అజాగ్రత్తగా.. అతివేగంతో నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 600కు పైగా మైనర్ల నడుపుతున్న వాహనాలు పట్టుకొని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా తీరు మారడం లేదు. వాహనం నడపాలంటే 18 ఏళ్ల నిండటమే కాకుండా రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఇవేమీ పట్టకుండా కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తుండడంతో వారు వచ్చిరాని డ్రైవింగ్‌తో ప్రమాదాల బారిన పడుతున్నారు.

మునగాల మండలం ఆకుపాముల వద్ద మార్చి 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతిచెందారు. మేళ్లచెరువు మండలం కందిబండకు చెందిన తమ్మారపు రాంబాయమ్మ(48), వెంకటనర్సయ్య(25) సూర్యాపేటలో ఓ శుభకార్యానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా ఆకుపాముల గ్రామ శివారులోకి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంతో తల్లీకొడుకు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు.

పెన్‌పహాడ్ మండల పరిధిలో ఇటీవల ఓ యువకుడు బైక్‌పై మహిళను ఎక్కించుకొని అతివేగంగా వెళ్తుండగా అకస్మాత్తుగా రోడ్డుపై గేదెలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయే సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకాల కూర్చున్న మహిళ కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. జిల్లాలో ఇలా తరచూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

జనవరి నుంచి జూన్ వరకు రోడ్డు ప్రమాదాలు

నెల	మొత్తం ప్రమాదాలు	బైక్ ప్రమాదాలు	మొత్తం మరణాలు	బైక్ మరణాలు
జనవరి	63	32	19	10
ఫిబ్రవరి	51	32	26	13
మార్చి	59	35	30	17
ఏప్రిల్	63	30	41	13
మే	50	31	20	14
జూన్	50	31	20	15
మొత్తం	336	191	156	82

వాహనదారులు నిబంధనలు పాటించాలి



రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కృషి చేస్తుంది. ఎల్లప్పుడు వాహనాల తనిఖీలు చేస్తున్నాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ చేసి అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్, మొబైల్ డ్రైవింగ్, ఓవర్ లోడ్‌లపై కేసులు నమోదు చేస్తున్నాం. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. యువకులు అతివేగంతో వాహనాలు నడిపి మృత్యువాత పడుతున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలి.
– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, సూర్యాపేట

స్నే'హితులు'

బుడి బుడి అడుగుల బాల్యంలో పరిచయమైన మరొక బంధం.. బడిలో బలపం పంచుకున్నప్పుడు ఏర్పడిన సంబంధం.. అక్షరాలు నేర్చుకునేటప్పుడు ఆసరాగా నిలిచిన అనుబంధం.. ఆటలు ఆడుతున్నప్పుడు అల్లుకున్న ఆత్మీయ అనుబంధం.. కష్టనష్టాల్లోనూ నేనున్నా అంటూ ఆసరాగా నిలిచేదే స్నేహ బంధం.

నేడు స్నేహితుల దినోత్సవం



ప్రత్యేక కథనాలు 8లో

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ అన్నారు. శనివారం ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్ష అనంతరం ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్, ఆర్డీఓల స్థాయిలో ధరణి పెండింగ్ దరఖాస్తులను వారం, పది రోజుల్లోపు క్లియర్ చేయాలని గడువు విధించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలి

సరళీకృత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా భూముల క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భూములు క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సుమారుగా 64,500, గ్రామ పంచాయతీ పరిధిలో 34,500 దరఖాస్తులు క్రమబద్ధీకరణకు వచ్చాయని, వీటిని పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస రెడ్డి, అశోక్ రెడ్డి, రామ దుర్గా రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలి

హుజూర్‌నగర్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈనెల 6న హుజూర్‌నగర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శనివారం ఆయన హుజూర్‌నగర్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం, ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. పట్టణంలోని ఆదర్శ కాలనీ, క్రైస్తవుల శ్మశాన వాటిక, టౌన్ హాల్, డిగ్రీ కాలేజీ సమాచారం, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ నాగేందర్ ఉన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట): మహిళలు రక్షణ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఆదర్శ మహిళా మండలి సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు చెడుమార్గాలు ఎంచుకోవద్దని సూచించారు. సెక్స్ వర్కర్స్‌గా పనిచేస్తున్న మహిళలు ఆ వృత్తి నుంచి బయటకు రావాలన్నారు. వారు బ్యూటీపార్లర్, టైలరింగ్, కిరాణా షాపులు, లేడీస్ కార్నర్ నిర్వహించుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు కోసం మహిళా మండలి సభ్యులు కృషి చేస్తారన్నారు. కోవిడ్-19 సమయంలో భర్తలను కోల్పోయిన వారికి కూడా జీవనోపాధి కోసం రుణాలు ఇప్పిస్తారని పేర్కొన్నారు. చట్టాల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా లీగల్ సెల్ సభ్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, డీఎస్పీ రవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి .దపుకు మల్లయ్య, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణ పిళ్లై యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, జే.శశిధర్, పీపీ కొంపల్లి లింగయ్య, జూనియర్, సీనియర్ న్యాయవాదులు, ఆదర్శ మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి ఆరాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీల క్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం ఆధ్యాత్మికపర్వాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.



స్వామి,అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రోడ్ల అభివృద్ధికి రూ.234 కోట్లు మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌అండ్‌బీ సీఈ

కోదాడ, హుజూర్‌నగర్: కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని వివిధ రోడ్ల అభివృద్ధికి రూ.234 కోట్లు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీ సీఈ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడ నియోజకవర్గానికి రూ.82 కోట్లు, హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రూ.151 కోట్లను మంజూరు చేసింది. కోదాడ పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణకు రూ.18 కోట్లు, జాతీయ రహదారి నుంచి రెడ్లకుంట వరకు రోడ్డు పనులకు రూ.20 కోట్లు, ఆకుపాముల నుంచి రత్నవరం రోడ్డుకు రూ.16 కోట్లు, కూచిపూడి రోడ్డుకు రూ.12 కోట్లు, చిలుకూరు నుంచి జెర్రిపోతులగూడెం రోడ్డుకు రూ. 8 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గం మేళ్లచెరువు మండలంలోని పీఆర్ సిమెంట్ పరిశ్రమ వద్ద నుంచి కిష్టాపురం ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డు విస్తరణకు రూ.15 కోట్లు, మేళ్లచెరువు నుంచి చౌటపల్లి రోడ్డు అభివృద్ధికి రూ.10 కోట్లు, హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి రోడ్డుకు రూ.80 కోట్లు, మేళ్లచెరువు నుంచి చింతిర్యాల రోడ్డుకు రూ.10 కోట్లు, గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం నుంచి వెలిదండ రోడ్డుకు రూ.6.90 కోట్లు, అమరవరం నుంచి అలింగాపురం రోడ్డుకు రూ.11.50 కోట్లు, మఠంపల్లి నుంచి జాన్ పహాడ్ రోడ్డుకు రూ.17.50 కోట్లు మంజూరయ్యాయి.

రేపు సాగర్ గేట్లు ఓపెన్!

- ఎగువ నుంచి పెరిగిన వరద ఉధృతి
- రోజుకు 30 టీఎంసీల నీరు రాక


నాగార్జునసాగర్: శ్రీశైలం జలాశయం నుంచి వరద ఉధృతి పెరగడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం గంటగంటకు పెరుగుతోంది. గరిష్ట నీటిమట్టానికి చేరువ అవుతుండడంతో సోమవారం సాయంత్రం సాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తే అవకాశముంది. శ్రీశైలం నుంచి 10 గేట్లు 20 అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 4,61,560 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతోపాటు కుడి, ఎడమ విద్యుదుత్పాదక కేంద్రాల ద్వారా 62,668 క్యూసెక్కులు కలిపి మొత్తంగా 5,24,228 క్యూసెక్కుల వరద నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం రాత్రి 9గంటలకు 567 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో 245 టీఎంసీల నీరు ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు. ఎగువ నుంచి వరద భారీగా వస్తున్నందున సాగర్ ప్రాజెక్టులో నీరు 300 టీఎంసీలకు చేరుకోగానే క్రస్ట్‌గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది.

సాగర్ నుంచి అవుట్ ఫ్లో ఇలా..

నాగార్జునసాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 6,660 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 3,374 క్యూసెక్కులు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 27,507 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అదేవిధంగా ఏఎమ్మార్పీకి 1800 క్యూసెక్కులు, వరద కాల్వకు 400క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గత నాలుగేళ్లలో ఆగస్టులోనే గేట్లు ఓపెన్

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు గత నాలుగేళ్లలో ఆగస్టు నెలలోనే తెరుచుకున్నాయి. 2019లో ఆగస్టు 12న, 2020లో ఆగస్టు 21న, 2021లో ఆగస్టు 1న, 2022లో ఆగస్టు 11న సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 2023లో వర్షాలు సరిగా కురవకపోవడంతో జలాశయానికి నీరు చేరలేదు. ఇప్పుడు కూడా ఆగస్టు మొదటి వారంలోనే గేట్లు ఎత్తనున్నారు.



నాగార్జునసాగర్ జలాశయం

అభివృద్ధికి నిధుల గ్రహణం



తిరుమలగిరిలో బేస్‌మెంట్ దశలోనే నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం



తిరుమలగిరిలో పిల్లర్ల దశలో ఆగిపోయిన ఆడిటోరియం భవన నిర్మాణం

- తిరుమలగిరి మున్సిపాలిటీలో రూ.50కోట్లతో చేపట్టిన పనులు
- ఏడాది గడిచినా పునాదులకే పరిమితం
- నిధుల లేమితో అంతటా నిలిచిన నిర్మాణాలు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు నిధుల లేమితో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గతేడాది నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో పనులన్నీ అసంపూర్తిగానే మిగిలాయి.

రూ.50 కోట్లతో శంకుస్థాపనలు

నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు గతేడాది జూన్ 29న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.50కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ చేతుల మీదుగా వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రారంభంలో పనులు వేగంగా సాగినా కాంట్రాక్టర్లకు బిల్లులు రాక నిలిపివేశారు. దీంతో కొన్నిచోట్ల స్లాబ్‌లు, మరికొన్నిచోట్ల పిల్లర్ల దశలోనే మిగిలిపోయాయి.

ఏయే పనులకు ఎన్ని నిధులు..

రూ.5 కోట్లతో మున్సిపాలిటీ భవనం, రూ.2 కోట్లతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవనం, రూ.3 కోట్లతో డంపింగ్ యార్డు, రూ.కోటితో వైకుంఠ ధామం, రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, రూ.కోటితో డ్రెయినేజీ పనులు, రూ.65 లక్షలతో అనంతారం-నందాపురం రోడ్డుపై కల్వర్టు, రూ.60 లక్షలతో 4 కమ్యూనిటీ హాళ్లు టీయూఎఫ్ఐడీసీ నిధులతో పాటు అమృత్ 2.0 పథకం కింద రూ.30 కోట్లతో మంచినీటి ట్యాంకులు, పైపులైన్‌తోపాటు మరో రూ.4.75కోట్లతో ఇతర నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించడంతో మున్సిపల్ ప్రజలు ఆనందించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో నిధుల విడుదలలో ఆలస్యం జరిగింది. ప్రభుత్వం మారి ఏడు నెలలు దాటినా నిర్మాణ పనులకు మాత్రం నిధులు విడుదల కాకపోవడంతో పనులన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కొన్నిచోట్ల చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం స్పందించి అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేసి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల బిల్లుల విడుదలపై ఉన్నతాధికారులకు నివేదించాం. కొన్ని చోట్ల పనులు కొనసాగుతున్నాయి. మిగతా చోట్ల నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే అన్ని చోట్లా పనులు పూర్తిచేస్తాం.
– సురేష్, పబ్లిక్ హెల్త్ ఏఈ, తిరుమలగిరి మున్సిపాలిటీ

దుర్గంధం వస్తోంది



మా దుకాణం పక్కన రూ.కోటి నిధులతో డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. కానీ మధ్యలోనే వదిలేశారు. మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దుర్గంధంతో రోజూ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– ప్రవీణ్‌కుమార్, 7వ వార్డు, తిరుమలగిరి

ఎంతో ఆశపడ్డాం

నూతన మున్సిపాలిటీ ఏర్పడి వివిధ పనులకు శంకుస్థాపన చేస్తే పట్టణం అభివృద్ధి చెందుతుందని ఎంతో సంతోషపడ్డాం. నిధులు విడుదలకాక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులన్నీ పూర్తిచేయించాలి.
– మూల వెంకట్‌రెడ్డి, తిరుమలగిరి

స్నే'హితులు'

ఒకరికొకరు అండగా బాల్యమిత్రులు



స్నేహంలోనే మాధుర్యం

- ఏ స్థాయికి ఎదిగినా.. ఆప్తమిత్రులు ఉండాలి
- నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి



నల్లగొండ : స్నేహంలో ఎంతో మాధుర్యం ఉంటుంది. అమ్మనాన్నల బంధం, భార్యభర్తల సంబంధం, అన్నదమ్ముల అనుబంధాల కంటే స్నేహితుల బంధం ఎంతో ముఖ్యమైనది అంటున్నారు నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. మాది నారాయణపేట్ జిల్లా, నర్వ మండలం, శ్రీపురం గ్రామం. అక్కడే ప్రభుత్వ పాఠశాలలో విద్యభ్యాసం చేశా. ఇంటర్మీడియట్ కూడా అక్కడే పూర్తి చేశా. ఉన్నత చదువులు హైదరాబాద్‌లో చదివా. పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు నాకు చాలా మంది స్నేహితులున్నారు. వారంతా ఇప్పుడు వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా.. స్నేహితులుగా అందరం ఒకరినొకరు గౌరవించుకుంటాం. నెలకు లేదా మూడు నెలలకోసారి తప్పకుండా మా ఫ్రెండ్స్ అంతా కలుస్తాం. వాళ్లు కలిసినప్పుడు అన్నీ మరిచిపోయి ఆనాటి జ్ఞాపకాలు నెమరవేసుకుంటు హాయిగా గడుపుతాం. ఇలా స్నేహంలోని మాధుర్యాన్ని పొందుతాం. స్నేహ బంధం ఎంతో గొప్పది. కాబట్టి నిజమైన స్నేహితులను వదులుకోవద్దు. మంచి స్నేహితులతో దీర్ఘకాలం స్నేహ బంధం కొనసాగడం మంచిది.

తోడుగా మేమున్నాం


ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు. గతంలో తమ క్లాస్‌మేట్ అనారోగ్యంతో మృతిచెందగా స్పందించి ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తమ క్లాస్‌మేట్ భర్త పక్షవాతానికి గురికావడంతో కుటుంబం గడవడం కష్టం కావడంతో రూ.70 వేలు అందిందిచ ఆమె భర్తకు ఫిజియోథెరపి, ఆటో సౌకర్యం కల్పించారు. ఇటీవల మరో స్నేహితుడి తల్లి మృతిచెందగా అతడి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందించి ఆపదలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైకల్యాన్ని ఓడించారు

తిప్పర్తి : స్నేహం కన్న గొప్పది ఏదీ లేదని నిరూపించారు తిప్పర్తి మండలం యర్రగడ్డ లగూడెం గ్రామానికి చెందిన తాటికొండ నాగిరెడ్డి స్నేహితులు. పుట్టుకతోనే దివ్యాంగుడైన నాగిరెడ్డి ఎంఏ బీఈడీ వరకు చదువుకున్నాడు. దివ్యాంగురాలైన పద్మ వివాహం చేసుకున్నాడు. నల్లగొండలో చిన్న గది అద్దెకు తీసుకొని ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. నాగిరెడ్డి ఇబ్బందులను గమనించిన అతడి స్నేహితులు నాగిరెడ్డి కుటుంబానికి రూ.3.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఇవే కాకుండా నెలనెలా ఎవరికి తోచినంత వారు సాయం అందజేస్తూనే ఉన్నారు.


నాటి కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ చేతులమీదుగా ద్విచక్ర వాహనం అందజేస్తున్న మిత్రులు(ఫైల్)

వీటితోపాటు నాగిరెడ్డి మిత్రుడు కరుణాకర్‌రెడ్డి ఇతర దాతల సహకారంతో రూ.లక్ష విలువగల ద్విచక్రవాహనాన్ని సమకూర్చి అండగా నిలిచారు.

సహ విద్యార్థులకు తోడుగా..


స్నేహితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

అర్వపల్లి : అర్వపల్లిలో విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ 2000–2001 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ తోటి స్నేహితులకు ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. వారి సహ విద్యార్థిని ఝాన్సీ భర్త మరణించగా ఆమెకు రూ.40 వేలు ఆర్థికసాయం అందించారు. పర్సాయపల్లి మాజీ సర్పంచ్ పుప్పాల శేఖర్ అనారోగ్యానికి గురికాగా వైద్యం కోసం రూ.50 వేలు అందజేశారు. తోటి మిత్రుడు జానయ్య, అతని కూతురు ఇద్దరూ ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబానికి రూ.80 వేలు అందించారు. కిరణ్ అకాల మరణం చెందగా ఆయన కుటుంబానికి రూ.50 వేలు సాయం చేశారు. తమకు చదువు చెప్పిన గురువు మల్లికార్జున్ అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. ఇలా ఈ బ్యాచ్ విద్యార్థులు 23 ఏళ్ల నుంచి తోటి వారికి ఆసరాగా ఉంటున్నారు.

స్నేహితులే ఇల్లు కట్టించారు


స్నేహితులు కట్టించిన ఇల్లు

మోత్కూరు : తోటి స్నేహితుడు ఆకస్మికంగా మరణించడంతో గూడు లేని అతని కుటుంబానికి స్నేహితులంతా కలిసి ఇల్లు కట్టించారు. మోత్కూరుకు చెందిన నల్లమాస లింగయ్య, ఆయన భార్య పద్మ, కుమారుడు అఖిల్ ఉన్నారు. లింగయ్య తన స్నేహితుడు గుండగోని రామచంద్రయ్య వద్ద సుమారు 20 ఏళ్లు గుమస్తాగా పనిచేశాడు. దీంతో వారి మధ్య స్నేహ బంధం ఏర్పడింది. కరోనా సమయంలో లింగయ్యను మృత్యువు కబలించింది. లింగయ్య ఆకస్మికంగా మరణించారు. దీంతో లింగయ్య స్నేహితుడు గుండగోని రామచంద్రు, కోమటి మత్స్యగిరి, బయ్యని రాజు, గాదె వెంకటేశ్వర్లు, సూదగాని కిష్టయ్య, బుర్ర సంతు, బుర్ర యాదయ్యతో పాటు మరికొందరు కలిసి సుమారు రూ.2 లక్షల విరాళాలతో లింగయ్యకు ఉన్న ఖాళీ స్థలంలో ఇంటిని నిర్మాణం చేయించారు. స్నేహితుడు మరణించినా గూడు లేని ఆ కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడాన్ని పలువురు వారిని అభినందిస్తున్నారు.

స్నేహితురాలికి సాయం..


సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలంలోని రహీంఖాన్‌పేటలో స్నేహితురాలి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. భర్త మృతితో బతుకు ఆగమవుతుందనుకున్న తరుణంలో వారంతా కలిసి ఆమెకు భరోసా కల్పించారు. గ్రామానికి చెందిన గజం ఉమారాణి భర్త దయ్యాల రాజు అనారోగ్య కారణాలచే ఇటీవల మృతి చెందాడు. చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న ఉమారిణికి పదో తరగతి 2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. అంతా కలిసి రూ.30 వేలు ఉమారాణికి అందజేశారు. అంతే కాకుండా ఏ ఆపద ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే తోచిన సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

బాల్య మిత్రుల భరోసా

వలిగొండ : వలిగొండలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001 పదో తరగతి పూర్వ విద్యార్థులలో జట్రోజు మంజుల భర్త నాగరాజు ఇటీవల అనారోగ్యంతో తోటి విద్యార్థులు ఆమెకు రూ.55 వేల ఆర్థికసాయం అందజేశారు. గతంలో వారితో చదువుకున్న మిత్రుడు నాగేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.38 వేలు అందజేశారు. తోటి స్నేహితులు ఆపదలో ఉంటే వారికి అండగా నిలుస్తామని చెబుతున్నారు పూర్వ విద్యార్థులు.


మిత్రురాలికి సాయం అందజేస్తున్న మిత్రులు (ఫైల్)

మిత్రుల ఔదార్యం


స్నేహితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

రామన్నపేట : ఆపదలోఉన్న బాల్యమిత్రుల కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. 2020 జూలై 19న డయాలసిస్ సమస్యతో బాధపడుతున్న స్నేహితుడు పెండెం మార్కండేయకు రూ.60 వేలు, 2021నవంబర్ 28న అనారోగ్యంతో మరణించిన గాదె సంజీవ కుటుంబానికి రూ.30 వేలు, 2023 ఆగస్టు 27న అనారోగ్యంతో చనిపోయిన సాల్వేరు రాజేశ్వర్ కుటుంబానికి రూ.58 వేలు, 2023 ఏప్రిల్ 9న అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నపాక వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.55 వేలు ఆర్థిక సాయమందించి అండగా నిలిచారు.

ఆపదలో అండగా..


రూ.50 వేలు అందజేస్తున్న మిత్రులు (ఫైల్)

చౌటుప్పల్ : చౌటుప్పల్ జెడ్పీహెచ్ఎస్ 1992–93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ మిత్రులకు ఎలాంటి ఆపద ఉన్నా వెంటనే స్పందించి తమవంతుగా చేయూతనిస్తున్నారు. చిన్నకొండూర్ గ్రామానికి చెందిన మిత్రుడు తీగుళ్ల కృష్ణయ్య 2021లో కరోనాతో చనిపోయాడు. స్నేహితులంతా కలిసి కృష్ణయ్య కుమార్తె పేరిట రూ.1.20 లక్షలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామానికి చెందిన డాకోజి రామకృష్ణ 2022లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని కుటుంబానికి రూ.62 వేల ఆర్థికసాయం అందించారు. చౌటుప్పల్‌కు చెందిన ఎండీ.చాంద్‌పాషా ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అప్పటికే తీవ్ర అనారోగ్యానికి గురైన అతని భార్య వైద్య ఖర్చులకు రూ.50 వేల సాయం అందజేశారు.


రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామ శివారులో అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే ఓ వ్యక్తి కాళ్లు, చేతులు, తలకు బలమైన గాయాలతో పడి ఉండడం గమనించిన పశువుల కాపరి వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి పుల్లారెడ్డికి సమాచారం అందించాడు. కార్యదర్శి వెంటనే మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చూడగా అప్పటికే ఆ వ్యక్తి మృతిచెందాడు. మృతుడు కిష్టాపురం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 45–50 సంవత్సరాలు ఉంటుందని, గోధుమ రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్, టవల్ ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పుల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు మిర్యాలగూడ రూరల్ పోలీసులను సంప్రదించాలని అన్నారు.

జలసవ్వడులు మొదలై.. 57 ఏళ్లు

- సాగర్ ఎడమ, కుడి కాల్వలకు నీటిని విడుదల చేసిన ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ


మొదటిసారి ఎడమ కాల్వకు నీరు విడుదలైనప్పుడు..


ప్రస్తుతం ఎడమ కాల్వకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు మొట్టమొదటిసారి నీటిని విడుదల చేసి ఆదివారంతో 57ఏళ్లు నిండాయి. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదలచేసి నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. 1955 డిసెంబర్ 10న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా.. 12సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కాలువల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. నాడు కటిక దరిద్రాన్ని అనుభవించిన రైతులు నేడు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదువ లేకుండా పోయింది.

నెరవేరని లక్ష్యం..

ఇనేళ్లు గడిచినా నాగార్జునసాగర్ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న భూములు ఇప్పటికీ బీళ్లుగానే ఉంటున్నాయి. ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి అంచనా వ్యయం కేవలం రూ.70 కోట్లు కాగా ఆ తర్వాత మరమ్మతులకే వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. అయినప్పటికీ కొన్నిచోట్ల ఆయకట్టుకు నీరందకపోవడంతో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో రూ.4,444.44కోట్లతో ప్రణాళిక తయారుచేసి పనులను ప్రారంభించారు. సమర్థులైన అధికారులు లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో 2014 వరకు పూర్తికావాల్సిన పనులు 2016 జూలైలో ముగిశాయి. అన్ని కోట్లు ఖర్చు చేసి ఆధునీకరణ పనులు చేపట్టినా అప్పుడే కాలువలకు గండ్లు పడటంతో పాటు కాల్వల లైనింగ్ రూపురేఖలు మారాయి. పనులన్నీ సమర్థవంతంగా పూర్తిచేస్తే కాలువల వ్యవస్థ పెరిగి మిగిలిన ఆయకట్టు సాగులోకి వచ్చేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.


మొదటిసారి నీటిని విడుదల చేసిన అనంతరం కాల్వను పరిశీలిస్తున్న ఇందిరాగాంధీ (ఫైల్)

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి


- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

భానుపురి (సూర్యాపేట): భావ సారూప్యత గల పార్టీలతో పొత్తు పెట్టుకుని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచేలా సీపీఐ నాయకులు దృష్టి సారించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ ఎక్కువ స్థానాలు గెలుచుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే అందేలా చూడవచ్చని అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజా తీర్పును మానసికంగా జీర్ణించుకోలేక పోతుందని, ఇంకా అధికారంలోనే ఉన్నామన్న భ్రమలో ఉందని అన్నారు. చిన్న చిన్న సమస్యలు, వ్యక్తిగత బాధలను తెలంగాణ ప్రజల బాధలుగా చూపెడుతూ ప్రజా ఉద్యమాలుగా బీఆర్ఎస్ నాయకులు చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాలుగో నగరం ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో మురికివాడలు లేకుండా మోడల్ కాలనీలను ఏర్పాటు చేయాలని కోరారు. రుణమాఫీలో ఉన్న లోటుపాట్లను సరిచేసుకొని అర్హులందరికీ స్కీమ్ వర్తించేలా చూడాలని సూచించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో వివిధ వృత్తులకు సంబంధించిన సంఘాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజాసంఘాల నిర్మాణం బలోపేతవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు ఉస్తెల నారాయణరెడ్డి, స్వాతంత్ర సమరయోధుడు దొడ్డ నారాయణరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, మేకల శ్రీనివాసరావు, యాదగిరి, ధనుంజయ, వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, ఎస్‌కే లతీఫ్, మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, అనంతుల మల్లీశ్వరి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారా పట్టివేత


పట్టుబడిన నిందితులు, బెల్లంను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: అక్రమంగా తరలిస్తున్న 350 కిలోల బెల్లం, 10 లీటర్ల సారాను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి వివరాలు వెల్లడించారు. చింతలపాలెం మండలం యర్రకుంటతండాకు చెందిన ధీరావత్ భానుప్రసాద్, వాంకుడోతు నరేష్, గుగులోతు రమేష్ ముఠాగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ నుంచి హుజూర్‌నగర్‌కు సారా తయారీకి ఉపయోగించే బెల్లంను ఆటోలో తీసుకొస్తుండగా.. చింతలపాలెం మండలం దొండపాడు వద్ద శుక్రవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 350 కిలోల బెల్లంతో పాటు 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. నరేష్‌ను అరెస్ట్ చేయగా భానుప్రసాద్, రమేష్ పరారీలో ఉన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ బెల్లంను మఠంపల్లి మండలంలోని కొత్తతండాకు సరఫరా చేసేందుకు ప్రయతిస్తున్న ధరావత్ నితిన్‌నాయక్‌ను కూడా అరెస్ట్ చేసి అతని బైక్‌ను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. వీరికి బెల్లం అమ్మిన ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామకు చెందిన వ్యాపారిపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు దివ్య, జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది, రవి, రుక్మారెడ్డి, నాగయ్య, నాగరాజ్, సంజయ్, నవీన్, మణికంఠ పాల్గొన్నారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

బీబీనగర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని జామేఉస్మానియాకు చెందిన గుగ్గిళ్ల సాయికుమార్ (22) ఈ నెల 1వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా తన స్కూటీపై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా శనివారం ఉదయం బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడం, చెరువు ఒడ్డున స్కూటీ ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలుసుకుని అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరి సౌందర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడి.. మహిళ మృతి


యాదమ్మ (ఫైల్)

తిరుమలగిరి: తేనెటీగలు దాడి చేయడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో శనివారం జరిగింది. తొండ గ్రామానికి చెందిన పల్లెర్ల యాదమ్మ(48) ఇంటి వద్ద బట్టలు ఉతుకుతుండగా.. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులం బంగారం, అరకేజీ వెండి పూజా సామగ్రి ఎత్తుకెళ్లిన దుండగులు


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

అనంతగిరి: మండలంలోని తమ్మరబండపాలెంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మరబండపాలెం గ్రామానికి చెందిన కనగాల నవీన్ జూలై 31న వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ నెల 2వ తేదీన తిరిగి గ్రామానికి చేరుకుని ఇంటికి వెళ్లేసరికి ఇంటి తాళం తీసి ఉండటం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలోని తులంన్నర బంగారం, అరకేజీ వెండి పూజా సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భువనగిరి క్రైం: పట్టణ పరిధిలోని వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వరంగల్ నుంచి స్వర్ణగిరి ఆలయం వైపు వెళ్తున్న కారు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనక నుంచి వచ్చిన బైక్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న హైదరాబాద్‌కు చెందిన సందీప్ గాయపడ్డాడు. స్వర్ణగిరి ఆలయానికి వెళ్లే దారిలో సరైన సూచిక బోర్డులు లేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పెట్రోల్ బంకులో నగదు చోరీ


సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు


చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి శివారులో గల పెట్రోల్ బంకులో శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు చోరీకి పాల్పడ్డారు. బైక్‌పై వచ్చిన యువకులు బంకులో నిద్రిస్తున్న బంకులో పనిచేసే వ్యక్తి జేబులోని రూ.45వేలకు పైగా నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. ఇది గుర్తించిన బంకు సిబ్బంది ఆ యువకులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. పెట్రోల్ బంకులోని సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా వారు తీసుకొచ్చిన బైక్‌ను సైతం చోరీ చేసి తీసుకొనట్లు తెలుస్తోంది. శనివారం బంకులో పనిచేసే సిబ్బంది చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దివ్యాంగురాలి హత్య

- మారణాయుధాలతో తలపై మోదిన దుండగులు


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దివ్యాంగురాలు హత్యకు గురైంది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి సూర్యాపేట మండలం జాటోత్ తండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాటోత్‌తండాకు చెందిన ధరావత్ రమాదేవి(37) దివ్యాంగురాలు. ఆమె తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. దీంతో ఆమె ఒంటరిగానే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి తండాలో అందరితో మాట్లాడిన రమాదేవి శనివారం తెల్లవారేసరికి తన ఇంట్లో రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. ఆమె తలపై మారణాయుధాలతో కొట్టిన ఆనవాళ్లు ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేట డీఎస్పీ రవి, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలు నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. మృతురాలి తమ్ముడు ధరావత్ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రమాదేవి (ఫైల్)